క్లుప్తంగా

పెట్రోలు బంక్ ప్రారంభం



పెట్రోలు బంక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు–పీలేరు జాతీయ రహదారి పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన ఐఓసీ పెట్రోల్ బంక్‌ను శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీ మోహన్‌రెడ్డి, ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, నాదమునిరెడ్డి, పోకల చంద్ర, హేమసుందర రెడ్డి, మునీశ్వర, రాజేంద్ర, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

శాంతిపురం: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేక శనివారానికి వాయిదా వేశారు. శుక్రవారం సమావేశానికి మొత్తం 18 మంది ఎంపీటీసీ సభ్యులలో ఎంపీపీ వసుంధర, ఎంపీటీసీ సభ్యుడు నామాలప్ప, 23 మంది సర్పంచులకుగాను ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ఎంపీపీ ప్రకటించారు.

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన



సోమల: మండలంలోని ఎగువపల్లెలో పశువైద్యాధికారి చందనప్రియ శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 50 పశువులకు ముద్ద చర్మ వ్యాధికి టీకాలు వేశారు. అలాగే 11 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. 8 దూడలకు నట్టల నివారణకు మందులను తాగించారు. పాడి రైతులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, సిబ్బంది అనూష, శివ, సోమశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కుప్పం రూరల్: 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా కుప్పం, గుడుపల్లె మండలాల పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని రెస్కో ఏడీ ప్రభాకర్ తెలిపారు.

రెడ్డివానిపోడులో ఇంట్లో చోరీ



రామకుప్పం: మండలంలోని రెడ్డివాని పోడు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ ఇంట్లో దొంగలు పడ్డారు. విజయ్ వ్యవసాయం చేస్తూ ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు తాళాలు పగలుగొట్టి బీరువాలో ఉన్న రూ.2.5 లక్షలు, 12 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్‌హెచ్‌ఓ మురళీబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- ప్రజా సమస్యలకు ప్రాధాన్యం
- చిత్తూరు, పలమనేరు నియోజకవర్గాల సమీక్షలో ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చిత్తూరు, పలమనేరు నియోజకవర్గాల సమీక్ష నిర్వహించారు. ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ, అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ దిశగా క్షేత్రస్థాయిలో అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఇల్లు మంజూరైనా ఇంతవరకూ నిర్మాణాలకు పూనుకోని లబ్ధిదారులకు అవగాహన కల్పించి, పనులు చేపట్టేలా ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోతే ఇంటి పట్టాను రద్దు చేసి, అర్హులైన మరొకరికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిత్తూరు, పలమనేరు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, వెంకటేగౌడ తమ నియోజకవర్గాల్లో చేస్తున్న అభివృద్ధి పనులపై మాట్లాడారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ, నియోజకవర్గాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతిని ఆయన వివరించారు.

పైపులైన్ పనులకు ప్రతిపాదనలు

నెల్లూరు జిల్లా కండలేరు నుంచి చామంతిపురం రిజర్వాయర్‌కు 5టీఎంసీల నీటిని పైపులైన్‌తో తరలించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తద్వారా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. పలమనేరు నియోజకవర్గంలో కైగల్, గంగమ్మ శిరస్సు, గంగమ్మ ఏరు రిజర్వాయర్లకు సంబంధించి ఇది వరకే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. చిత్తూరు నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, కట్టమంచి 'వై' జంక్షన్ రోడ్డు, చిత్తూరు–పుత్తూరు రోడ్డు, చిత్తూరు, గుడిపాలలో కొత్త శ్మశాన వాటికల ఏర్పాటుకు భూ సేకరణ, ఇతర సమస్యల పరిష్కారంపై చర్చించారు. పలమనేరు రూరల్ మండలంలో సంబరపూర్ రోడ్డుకు అటవీశాఖ అనుమతులు, వి.కోట సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా మార్పు చేయాలని చర్చించారు. సమీక్ష లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, నగరపాలక డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెప్ప

పెద్దపంజాణి: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ రెడ్డెప్ప కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత వివిధ శాఖలు అధికారులు తమ ప్రగతి నివేదించారు. పెద్దవెలగటూరు, వీరప్పల్లెలో ఎండీ ఆపరేటర్ ఇంటింటికీ రేషన్ బియ్యం సక్రమంగా వేయడం లేదని ఎంపీటీసీలు మోహన్ రెడ్డి, సుబ్రమణ్యం సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. చెన్నారెడ్డివల్లె, వీరప్పల్లె మార్గంలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుష్మకీర్తి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ, సింగిల్‌విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, ఎంపీడీఓ భాస్కర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు నామినేషన్ల తిరస్కరణ

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు పంచాయతీ 6వ వార్డుకు దాఖలైన 4 నామినేషన్లలో రెండింటిని తిరస్కరించినట్టు రిటర్నింగ్ అధికారి వెంకటరమేష్ తెలిపారు.

థ్యాంక్యూ సీఎం సార్!

- సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం
- సున్నా వడ్డీ జమ చేశారని కృతజ్ఞతలు



సదుంలో..



రొంపిచెర్ల : రామచంద్రాపురం కాలనీలో..

సదుం/రొంపిచెర్ల/సోమల/పెద్దపంజాణి: ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని మహిళల ఖాతాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నా వడ్డీ మొత్తాన్ని జమ చేసిన నేపథ్యంలో శుక్రవారం సదుం మండలం జోగివారిపల్లెలో, రొంపిచెర్ల మండలం రామచంద్రాపురం కాలనీలో, సోమల మండలం పొదగుంటపల్లె పంచాయతీలో, పెద్దపంజాణి మండలం రాయలపేటలో సీఎం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రపటాలకు మహిళలు పాలాభిషేకం చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన హామీ మేరకు అక్కచెల్లెమ్మల ఖాతాలకు సున్నావడ్డీ జమచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. అలాగే జాండ్లవారిపల్లెలో మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎంకు దక్కిందని సదుం ఎంపీపీ ఎల్లప్ప చెప్పారు. రొంపిచెర్ల మండలంలో 530 సంఘాలలోని 7519 మంది సభ్యులకు సున్నా వడ్డీ కింద రూ.82 లక్షలను, పెద్దపంజాణి మండలంలోని 1100 స్వయం సహాయక సంఘాలకు 4వ విడత సున్నా వడ్డీ రూ 1.43 కోట్లు జమ చేశారని ఏపీఎంలు క్రిష్ణప్ప, బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో సర్పంచులు అనితాకుమారి, జయరాం, అరుణ, ఉప సర్పంచ్ అశ్విని, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, సోమల మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, ఏపీఎం శివయ్య, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సుబ్రమణ్యం, నారాయణ, సీసీలు వెంకట నారాయణరావు, రమణారెడ్డి, నాగరాజ, సంఘమిత్రలు, వీఓ







రొంపిచెర్ల: జాండ్లవారిపల్లెలో కేక్ కట్ చేస్తున్న మహిళలు, సోమల: పొదలగుంటపల్లెలో.., పెద్దపంజాణి: రాయలపేటలో..

పేదల జీవితాల్లో 'నవరత్నాల' వెలుగు

- ఎమ్మెల్సీ భరత్



భూరుగులపల్లెలో బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని జిల్లా వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ అన్నారు. శుక్రవారం మండలంలోని సంగనపల్లె గ్రామ పంచాయతీలో భూరుగులపల్లె, చిన్నపర్తికుంటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. 165 కుటుంబాలను ఆయన పలకరించారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు.

టీచర్‌పై ఎమ్మెల్సీకి విద్యార్థుల ఫిర్యాదు

అనంతరం ఎమ్మెల్సీ జెడ్పీ హైస్కూలును సందర్శించారు. పాఠశాలకు బయోటెక్నాలజీ టీచర్ సక్రమంగా రావడం లేదని విద్యార్థులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన ఆ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఈఓను ఫోన్‌లో కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ క్రిష్ణమూర్తి సర్పంచులు అమరనాథ్, రామమూర్తి, ఎంపీటీసీ బసవప్ప వెంటకమ్మ, విశ్వనాథ్, గోపాల్, అప్పయ్య, గవాస్కర్, యూత్ రవి, సంపంగి, శీనప్పనాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ఐక్య వేదిక



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణ

గంగవరం: గ్రామాల్లో సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజాప్రతినిధులందరూ ఏకమై ఈ ఐక్య వేదిక ఏర్పాటు చేసుకున్నామని ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ పార్వతి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, వ్యవసాయం, హార్టికల్చర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్, విద్యుత్, వైద్యం, విద్య, నీటిపారుదల, హౌసింగ్, వెలుగు, మహిళా–శిశు సంక్షేమ శాఖల వారీగా అధికారులు ప్రగతిని నివేదించారు. గుండుగల్లు, కొత్తపల్లె, తాళ్లపల్లె, మేలుమాయి దళితవాడలకు శ్మశాన వాటికల నిమిత్తం భూములు కేటాయించామని తహసీల్దార్ అమర్నాథ్ తెలిపారు. చిన్నూరులో శ్మశానవాటిక కోసం సేకరించిన భూమికి అధికారికంగా ఆదేశాలు ఇప్పించాలని ఎంపీటీసీ లేఖ్య తహసీల్దార్‌ను కోరారు. మామడుగు సచివాలయ పరిధిలోని కోటగురివేపల్లె జగనన్న కాలనీకి దారి కల్పించాలని సర్పంచ్ భాస్కర్‌రెడ్డి కోరారు. అయితే ఆ దారిలో ఉన్న భూముల విషయమై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోందని తహసీల్దార్ బదులిచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ తాజీమ న్నూర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజా రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు, పక్కన న్యాయమూర్తులు కార్తీక్, సింధు

పుంగనూరు: జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబర్ 9న నిర్వహిస్తున్నామని, దీనిని జయప్రదం చేయాలని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు కోరారు. శుక్రవారం న్యాయవాదుల సంఘ కార్యాలయంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్, అడిషినల్ జూనియర్ సివిల్‌జడ్జి సింధుతో కలసి ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీ దిశగా కేసులను పరిష్కరిస్తామన్నారు. న్యాయవాదులు, కక్షిదారులు కలసి పట్టువిడుపులతో దీనికి పూనుకుని అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు. సమావేశంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శి శివశంకర్ నాయుడు, ఆనందకుమార్, న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, బాలాజికుమార్, వెంకట్రామయ్య శెట్టి, హితేంద్ర, మల్లికార్జుననాయుడు, గిరి తదితరులు పాల్గొన్నారు.

సమావేశం విజయవంతం చేయండి

చౌడేపల్లె: వైఎస్సార్‌సీపీ యాదవ ఆత్మీయ సమావేశానికి కులస్తులు విధిగా హాజరై విజయవంతం చేయాలని పీకేఎం ముడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ కోరారు. శుక్రవారం యాదవ సంఘాల నేతలతో కలిసి బోయకొండ గంగమ్మను దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 14వ తేది సోమవారం ఉదయం 9.30 గంటలకు జగనన్న కాలనీ రాంపల్లె బైపాస్ రోడ్డు దండుపాళ్యం వద్ద సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ముఖ్య అతిథులుగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎంపీలు, మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, మస్తాన్ యాదవ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు భేష్
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల రూబీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ



కళాశాల స్థల దాతలు గంగిరెడ్డి, రత్నారెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధ్యాపకులు

పలమనేరు: నాడు–నేడుతో విద్యకు పెద్దపీట వేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. పట్టణంలోని శ్రీ వర్రచెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 30వ వార్షికోత్సవం(రూబీ) శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశులు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులకుతోడు విశాలమైన క్రీడా మైదానం, అన్ని వసతులు, కంప్యూటర్ ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానాన్ని మరో ముఖ్య అతిథి, ఏపీ ఉన్నత విద్య నియంత్రణ–పర్యవేక్షణ కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విక్రాంత్ రెడ్డి సమగ్రంగా వివరించారు. విలువలతో కూడిన విద్య ఆవశ్యకతను కళాశాల దాతలు గంగిరెడ్డి, రత్నారెడ్డి తెలియజేశారు. ఇప్పటివరకూ కళాశాలలో జరిగిన అభివృద్ధిని పూర్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రరెడ్డి విపులీకరించారు. ముఖ్యఅతిథులు, స్థల దాతలను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, స్వాతంత్ర్య సమరయోధులు టీసీ రాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు సీతారామయ్య, వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం, కౌన్సిలర్లు కమాల్, రవి, నాయకులు ప్రహ్లాద, పూర్వ విద్యార్థులు, పట్టణవాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'నా భూమి.. నాదేశం'



పుంగనూరులో..



పెద్దపంజాణి : నిడిగుంటలో నిర్వహిస్తున్న ర్యాలీ



చౌడేపల్లె : కాగతిలో..



కుప్పం: మొక్కలు నాటుతున్న రెక్టార్ తదితరులు

పుంగనూరు: స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దేశిదొడ్డిలో నాభూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు. అలాగే పట్టణంలోని శుభారాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. సర్పంచ్ మునస్వామి, సెక్రటరీ పద్మనాభరెడ్డి, సచివాలయ ఉద్యోగులు , వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: మండలంలోని కాగతి, శెట్టిపేట, లద్దిగం గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు శిలాఫలకాలు ఆవిష్కరించి, మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ సుధాకర్, సర్పంచ్ కృష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, జేఈ ధనుంజయుడు, మాజీ ఎంపీటీసీ రమేష్ బాబు, సర్వేయర్ మురళీకృష్ణ, నేతలు కృష్ణారెడ్డి, మణిరాజు,, శ్రీనివాసులు, సచివాలయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లె, పొదలగుంటపల్లె, నంజంపేట, ఆవులపల్లె పంచాయతీలలో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. శిలా ఫలకాలను ఆవిష్కరించి మాజీ సైనికులను సన్మానించారు. అనంతరం గ్రామాలలో మొక్కలను నాటారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం భాస్కర్. మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి మాట్లాడారు. వైస్ ఎంపీపీ ప్రభాకర, సర్పంచులు శీలం సిద్దులమ్మ, వెంకటరెడ్డి, జయరాం, కోదండరాజు, ఎంపీటీసీలు సరస్వతమ్మ, మహమ్మద్ జిన్నా, అపరాజిత, ఈఓపీఆర్డీ సుధాకర్ కుమార్, ఏపీఓ దినకర్ బాబు, ఏపీఎం శివయ్య, పంచాయతీ కార్యదర్శి జైశంకర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సదుం: పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యతని ఎంపీపీ ఎల్లప్ప అన్నారు. మండలంలోని చెరుకువారిపల్లె, జోగివారిపల్లెలో సోమవారం నిర్వహించిన నాభూమి–నాదేశం కార్యక్రమంలో ఆయన శిలాఫలకాలను ఆవిష్కరించి, మొక్కలు నాటారు. సర్పంచులు ఐశ్వర్య, అనితకుమారి, ఏపీఓ శివశంకర్, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో శుక్రవారం నాభూమి– నాదేశం కార్యక్రమం నిర్వహించారు. పుడమితల్లిని కాపాడుకుందాని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి, నాదమునిరెడ్డి, ప్రసాద్, ఏపీఓ షౌకత్‌అలీ, ఈసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండల కేంద్రంతోపాటు పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె గ్రామ పంచాయతీలలో శుక్రవారం నాభూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. చిచ్చిలివారిపల్లె సచివాలయం వద్ద ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి జెండా ఎగుర వేసి మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో ఏర్పాటు చేసిన శిలా ఫలకాలను ప్రారంభించారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, సర్పంచులు ఇబ్రహీంఖాన్, చిచ్చిలి అరుణమ్మ, రమణయ్య, నాగిరెడ్డి, ఎంపీటీసీలు విజయశేఖర్, సిరాజున్నీసా, నూలు రెడ్డెప్ప, కార్యదర్శులు నాగరాజ, శివగణేష్, ఏపీఓ బాలమురళి, పార్టీ నాయకులు కరీముల్లా, లక్ష్మయ్య, ప్రకాష్‌రెడ్డి, మస్తాన్, టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పలమనేరు నియోజకవర్గం

పలమనేరు: మున్సిపల్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది ఆయా వార్డు కౌన్సిలర్లతో కలసి పట్టణంలో శుక్రవారం మొక్కలను నాటారు. 20వ వార్డు కౌన్సిలర్ మురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కిరణ్, కౌన్సిలర్లు కోదండరామయ్య, రహీంఖాన్, కమాల్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని తాళ్లపల్లె, పసుపత్తూరు, గంగ్రాజుపల్లె, గుండుగల్లు సచివాలయాల పరిధిలో నా భూమి– నా దేశం, వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీగా వెళ్లి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు. ఎంపీపీ వెంకటరమణ, సర్పంచులు రమణ, శంకరమ్మ, రామక్క, మల్లికార్జున, ఎంపీటీసీలు కస్తూరమ్మ, భాస్కర్, భారతి, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని నడిగుంటలో సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం నౌషాద్, ఎస్‌హెచ్‌ఆర్సీ ప్రెసిడెంట్ అంజప్ప, ఫీల్డ్ అసిస్టెంటు రెడ్డెమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వి.కోట: మండలంలోని కృష్ణాపురం గ్రామ సచివాలయం వద్ద ఎంపీపీ యువరాజు ఆధ్వర్యంలో నా భూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. శిలాఫలకాన్ని ఎంపీపీ ఆవిష్కరించి మొక్కలు నాటారు. ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్‌ఖాన్, మండల సచివాలయ కన్వీనర్ కిషోర్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాబు, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ నాగరాజు, పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సర్పంచ్ వెంకటేష్ పిలుపునిచ్చారు. బైరెడ్డిపల్లె సచివాలయం వద్ద మొక్కలను ఆయన నాటారు. నా భూమి– నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వైస్ సర్పంచ్ తబ్రాజ్, పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కుప్పం నియోజకవర్గం

కుప్పం: నాభూమి–నాదేశం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ద్రవిడ వర్సిటీ రెక్టార్ అనురాధ పిలుపునిచ్చారు. శుక్రవారం కనమనపల్లె అగరం, కోటసెంబగిరి, కుప్పిగానిపల్లె పంచాయతీలలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెక్టార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కలు నాటారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

శాంతిపురం: మండలంలోని శివరామపురం, అనికెర, మఠం, 64 పెద్దూరు, సి.బండపల్లె, కెనమాకులపల్లె, రేగడదిన్నేపల్లె, అబకలదొడ్డి పంచాయతీలలో శిలా ఫలకాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించారు. పంచ ప్రాణ్ ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ పట్టాభి, ఎంపీడీఓ హేమమాలిని, ఉపాధి ఏపీఓ అనిల్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

గుడుపల్లె: మొక్కలు విరివిగా నాటి, పచ్చదనం పెంచి, పర్యావరణ పరిరక్షణకు అందరూ తమవంతు కృషి చేయాలని ఎమ్మెల్సీ భరత్ కోరారు. శుక్రవారం ఆదర్శ పాఠశాలలో నాభూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భువనేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను ఎంఈఓ శివరత్నమ్మ శుక్రవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన రికార్డులు, ఉపాధ్యాయులు, పిల్లల హాజరును పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.